సాక్షి
# అన్నమయ్య జిల్లా
గురువారం । 2 । నవంబర్ । 2023





## ఆటల్లో మేటి.. సత్తా చాటి

కడప లోని వైఎస్సార్ క్రీడా పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయి టోర్నమెంట్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు. -10లో



## క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.10.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.250 | రూ.320 |
| రెండోరకం | రూ.150 | రూ.248 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 294 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 460 | 505 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 413.480 కిలోలు

# గోకులంలో నవశకం

**పాడి పశువుల వృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చేయూతనిస్తోంది. మేలు జాతి పశువుల వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించి పెయ్య దూడలను ఉత్పత్తి చేయిస్తోంది. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి పశువులలో పాల దిగుబడి పెంచే చర్యలు చేపడుతూ రైతు ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోంది.**

- పాడిరైతుకు ప్రభుత్వం ఆర్థికఅండ
- అద్భుత ఫలితాలిస్తున్న కృత్రిమ గర్భధారణ పథకం
- పెయ్యదూడలతో పెరుగుతున్న ఆదాయం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పెరిగిన పాల దిగుబడి



గుర్రంకొండలో పాడి రైతు ఇంట జన్మించిన పెయ్యదూడ

సాక్షి, కడప డెస్క్: రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ పెయ్య దూడల సంతానోత్పత్తికి చర్యలు చేపట్టింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మేలుజాతి పశువులు కొనుగోలు చేయడానికి వ్యయ ప్రయాస పడకుండా ఇక్కడే పెయ్యదూడల ఉత్పత్తికి సహకారం అందిస్తోంది. ఈ పథకాన్ని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. ఈ మేరకు రెండు జిల్లాల్లో దాదాపు 6000వేల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో తొలివిడత గర్భధారణ చేయించిన పశువులకు 90 శాతం మేర పెయ్యదూడలే జన్మించడం విశేషం. దీంతో పాడి రైతుల ఇంట ఆనందం వెల్లివిరిస్తోంది.

### పథకం ఉద్దేశ్యం

మేలుజాతి పశు సంపదను త్వరితగతిన అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన. సాధారణంగా పశువులకు పెయ్య దూడలే పుడతాయనే నమ్మకం రైతుకు ఉండదు. గతంలో సాధారణ వీర్యనాళికల ద్వారా కృత్రిమ గర్భధారణ చేసినా పెయ్య దూడలు పుట్టే శాతం కొంత వరకే ఉండేది. కోడె దూడలు పుడితే ఉపయోగం ఉండదని భావించిన రైతులు వాటిని బయట విక్రయిస్తూ వచ్చారు. పాల ఉత్పత్తి లేక వారు నష్టపోయారు. ఇది గుర్తించిన ప్రభుత్వం మేలు జాతి పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని తీసుకువచ్చింది.

### ప్రభుత్వ రాయితీ

పాడి పశువులకు 'లింగ నిర్ధారణ వీర్య సాంకేతిక పద్ధతి'లో కృత్రిమ గర్భధారణకు రూ.1350 ఖర్చవుతోంది. ఇందులో రైతు వాటాగా రూ.500 చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.850 రాయితీ ఇస్తుంది. ఈ క్రమంలో వీర్యనాళికలను రెండు డోసులుగా పశువులు లేదా ఆవులకు వేస్తారు. ఆవులు 9 నెలలకు, గేదెలు 10 నెలలకు ఈతకు వచ్చి పెయ్యదూడలు జన్మనిస్తాయి. కాగా, పశు సంవర్ధక అధికారులు తొలిసారి వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయిస్తారు. పశువు గర్భం దాల్చకపోతే రెండోసారి గర్భధారణ చేయిస్తారు. అప్పటికీ గర్భం దాల్చకపోతే రైతుకు సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు. అయితే తొలిసారి మగ దూడ పుట్టినా, ఒక వీర్య నాళిక తర్వాత రెండో నాళిక పశువుకు ఇవ్వకపోయినా సొమ్ము తిరిగి ఇవ్వరు. ఈ నేపథ్యంలో పథకం ప్రవేశపెట్టినపుడు ఎంపిక చేసిన గ్రామాల్లో పలువురు లబ్ధిదారులను గుర్తించారు. వారికి లింగ నిర్ధారణ వీర్య సాంకేతిక పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం ముర్రా, జెర్సీ, హెచ్.ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్.ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ మొదలైన మేలు జాతి పశువు లింగ నిర్ధారిత వీర్య నాళికలు వారికి అందుబాటులో ఉంచి కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే 90 శాతంపైగా పెయ్య దూడలు పుట్టి రైతుల ఇంట లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని ప్రస్తుతం రైతులతో పాటు పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, యస్.జి.ఓ మరియు ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకుంటున్నాయి. కొత్తగా ఎవరైనా ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటే సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చు.

### మంచి పథకం అందించారు



పెయ్యదూడల ఉత్పత్తి పథకం చాలా బాగుంది. పాడిరైతులకు ప్రభుత్వం అందించిన వరమిది. గతంలో ఆవు/గేదె చూలు కట్టినప్పటి నుంచి ఏ దూడ పుడుతుందోనని బెంగ ఉండేది. అదృష్టం కొద్దీ పెయ్యదూడ పుడితే లాభంగా ఉండేంది. కోడె దూడ పుడితే పాడి రైతుకు ఎటువంటి లాభం ఉండేది కాదు. ఈ పథకం వచ్చిన తరువాత కచ్చితంగా పెయ్యదూడలే పుడతాయనే నమ్మకం వచ్చింది. – ఎన్. రమేష్, పాడిరైతు, చిన్నమండెం, అన్నమయ్య జిల్లా

### పాల దిగుబడి పెంపు లక్ష్యం



పాలదిగుబడి పెంపు లక్ష్యగా ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చింది. రైతులు సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలి.
– డాక్టర్ జి.రమేష్, కార్యనిర్వహణాధికారి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

### లక్ష్మీకళ వచ్చింది



పెయ్యదూడల పథకంతో మా ఇంట్లో పాడిఆవు పెయ్యదూడకు జన్మనిచ్చింది. దీంతో మా ఇంటికి లక్ష్మీకళ వచ్చినట్లయ్యింది. పెయ్యదూడలు పుడితే పాల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం ద్వారా మేము ఎంతో బాగుపడుతాం.
– అమరావతి, మహిళా పాడి రైతు, టి.చాకిబండ, అన్నమయ్య జిల్లా

### చాలా సంతోషంగా ఉంది



నేను డైరీఫాంను నిర్వహిస్తున్నాను. జనవరి 20న మా ఆవుకు లింగనిర్ధారణ వీర్యం వేయించాను. కచ్చితంగా 9 నెలల 9 రోజులకు పెయ్యదూడకు జన్మనిచ్చింది. చాలా సంతోషంగా ఉంది. – జి.సునిల్‌కుమార్‌రెడ్డి, కలసపాడు మండలం, కట్టకిందపల్లె, వైఎస్సార్ జిల్లా

### శుభపరిణామం



ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి పెయ్యదూడల యూనిట్ రైతులకు అందించడం శుభపరిణామం. కేవలం రూ.500తో ఈ పథకం అమలు చేస్తున్నారు. మిగిలిన రూ.850 ప్రభుత్వమే రాయితీ భరించి మా కు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ పథకంతో ఎంతో మేలు జరుగుతోంది. – రామకృష్ణ, పాడిరైతు, దిగువగొట్టివీడు, అన్నమయ్య జిల్లా

### ఎంతో మేలు చేస్తోంది



నేను జనవరి నెలలో నా పశువుకు సూది వేయించా. ఇటీవలే అది పెయ్యదూడను ఈనింది. ఈ పథకంతో ప్రభు త్వం ఎంతో మేలు చేస్తోంది. – శంకర్‌రెడ్డి, బయనపల్లి, కమలాపురం మండలం, వైఎస్సార్ జిల్లా

## న్యూస్‌రీల్

### జిల్లాలో 18 కరువు మండలాలు

రాయచోటి: 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అన్నమయ్య జిల్లాలో 18 మండలాలను ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గాలివీడు, రాయచోటి, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గుర్రంకొండ, కలకడ, కుంభంవారిపల్లి, పీలేరు, సుండుపల్లె, వీరబల్లి, తంబళ్లపల్లి, పెద్దమండెం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి కొత్తకోటలను తీవ్రంగా నందలూరు, పెనగలూరులను ఓ మోస్తరు కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించి జిల్లా రైతులను, ప్రజలను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న జి.నారాయణవర్మ

రైల్వేకోడూరు: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జయప్రకాశ్ నారాయణవర్మను బుధవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.నారాయణవర్మకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

### జిల్లా సిరికల్చర్ అధికారికి గౌరవ డాక్టరేట్



జిల్లా కలెక్టర్ గిరీషా చేతు మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి

రాయచోటిటౌన్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధికి కృషి చేసినందుకు అన్నమయ్య జిల్లా సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డికి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ పాండిచ్చేరి వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. బుధవారం రాయచోటిలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ డాక్టరేట్ పట్టాను అందజేసి అభినందించారు. గత నెల 28వ తేదీన పాండిచ్చేరిలో జరిగిన యూనివర్సిటీ వారు నిర్వహించిన కాన్వకేషన్‌లో డాక్టరేట్ అందజేసినట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిగా జీహెచ్‌ఎంసీలో, అలాగే హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ స్టడీ డైరెక్టర్‌గా సేవలందించినందుకు, కోవిడ్ సమయంలో రాయచోటిలో ప్రత్యేక అధికారిగా, నోడల్ ఆఫీసర్‌గా విశేష సేవలంచినందుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

### 5 నుంచి సీపీఐ రాష్ట్ర బృందం పర్యటన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాను కరువు మండలాల జాబితాలో చేర్చి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ నవంబర్ 5,6 తేదీల్లో సీపీఐ రాష్ట్ర నాయకుల జిల్లాలో పర్యటించనుంది. వీరి పర్యటనను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరుణడు కరుణించకపోవడంతో ఖరీఫ్ సీజన్ పూర్తిగా కుంటుపడిందని, రబీ సీజన్లో అయినా తగినంత వర్షపాతం నమోదైతే సాగు చేసుకుందామన్న జిల్లా రైతుల ఆశలు అడియాశలయ్యాయన్నారు. ప్రభుత్వం వీరికి సహాయం చేసి ఆదుకోవాలన్నారు. పర్యటనకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు, పి హరినాథ్ రెడ్డి హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

### రక్తహీనత తగ్గించడంపై దృష్టి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో గర్భిణులు, యుక్త వయసు బాలికలు, ఐదేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రత్యేకశ్రద్ధ వహించాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మండలస్థాయిలో ఐసీడీఎస్, వైద్యాధికారులు సమన్వయంతో ఇందుకోసం పనిచేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సభాభవనంలో పీహెచ్‌సీ వైద్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు వివాహాలు చేస్తే తల్లిదండ్రులు, పెళ్లితంతు చేసిన పెద్దలు, ఫంక్షన్‌హాల్ యజమానులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన 3759 మంది కంటిశుక్లాల కేసులను, ఆరోగ్యశ్రీలో రెఫర్ చేసిన సాధారణ వ్యాధులకు సంబంధించి 2458 మందికి ఈనెల 15వ తేదీలోపు శస్త్రచికిత్సలు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లావైద్యారోగ్య శాఖాధికారి డా.నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలూ..ఆందోళన వద్దు

- జీఎన్ఎస్ఎస్ అనుబంధ ప్రాజెక్టుల ద్వారా 1,6000 వేల ఎకరాలకు సాగునీరు
- జూన్ 24 వరకు ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే అవకాశం
- ఎస్ఈ మల్లికార్జునరెడ్డి



ఎస్ఈ మల్లికార్జునరెడ్డి

కడప సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఉందని, మనకు మాత్రం ప్రాజెక్టుల్లో 57 శాతం వాటర్ స్టోరేజి ఉందని, అందువల్ల రైతులు ఎటువంటి అందోళన చెందాల్సిన అవసరం లేదని గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ఎస్ఈ మల్లికార్జునరెడ్డి బుధవారం తెలిపారు. జీఎన్ఎస్ఎస్ అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి నీటి వివరాలను, ఆయకట్టుకు నీరు అందించే విషయాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల్లో 30 శాతమే నీరు ఉందన్నారు. కానీ జీఎన్ఎస్ఎస్ పరిధిలో 55 శాతం స్టోరేజ్ ఉందన్నారు. ఇందుకు సంబధించిన ప్రాజెక్టుల్లో 54.297 టీఎంసీలు పూర్తి సామర్థ్యతగా 31.123 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఆయకట్టుకు నీరు అందవని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లక్షా ఆరు వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టుల పరిధిలో వచ్చే జూన్ 24 వరకు నీళ్లు ఇచ్చేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడం వల్లే ఈ పరిస్థితి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు ప్రతి రోజు ఈ విషయంపై సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. మైలవరం ప్రాజెక్టుకు గండికోట రిజర్వాయర్ నుంచి ఇప్పటికే రెండు టీఎంసీల నీటిని వదిలామన్నారు. మరో టీఎంసీ వదిలి 45 వేల ఎకరాల ఆయకట్టుకు రబీ సీజన్‌కు నీరు ఇవ్వనున్నట్లు చెప్పారు.

### ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు వివరాలు..

జిల్లాలోని వామికొండ, సర్వరాయర్ సాగర్ ప్రాజెక్టుల పరిధిలో పరోక్షంగా 2500 ఎకరాలకు మేలు జరుగుతుందని జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లికార్జున రెడ్డి చెప్పారు.చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 14600 ఎకరాలకు, పీబీసీకి 24500 ఎకరాలకు, పైడిపాలెం, జీకేఎల్ఎం సిస్టమ్ కింద 19500 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తొలిసారిగా మైలవరం నుంచి ఆదినిమ్మాయపల్లె కేసీ కెనాల్ ఆయకట్టుకు 200 క్యూసెక్కులు, వెలిగోడు కెనాల్ నుంచి చాపాడు కెనాల్‌కు నీరు ఇచ్చినట్ల చెప్పారు.గతంలో ఈ పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. వీలైనంత వరకు రైతులు ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. ఈ అవసరాలన్నింటికి 12 టీఎంసీలు నీరు అవసరం ఉందని తెలిపారు. ఇంకా 18.809 టీఎంసీలు మిగులు ఉంటుందన్నారు. రబీ సీజన్‌లో సాగు నీటికి సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదని ఎస్ఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

# అమరజీవి త్యాగం మరువలేనిది

**జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్**



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

రాయచోటి: ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని, ఆ మహనీయుని స్ఫూర్తితో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ పరెడ్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథులు శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వవిప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా ఎస్పీ బి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషలతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంఘిక సేవ, విద్యాభివృద్ధిలో విశేషంగా కృషి చేసిన సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గంగన్న, సామాజిక కార్యకర్త షేక్ సాహెబ్ పీర్‌లను ముఖ్య అతిథులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు తలెత్తుకొని గర్వంగా జీవిస్తున్నారంటే అది అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగఫలితమే అన్నారు.

- శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వవిప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంతో ఏర్పడిన తొలి తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 1న ప్రత్యేకంగా తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్ర వేడుకలను నిర్వహించుకుంటున్నామన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో పయనించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలుగువారిని కూడా మదరాశీలుగా పరిగణించేవారన్నారు. తెలుగుభాష మాట్లాడే ప్రజలందరూ ఒకే ప్రాంతంలో ఉండాలని, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష చేసి అమరులయ్యారన్నారు. ఎంతోమంది మహనీయుల ప్రాణ త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ఆంధ్రరాష్ట్రమన్నారు. పరిపాలనను మరింత పారదర్శకంగా ప్రజల ముంగిటకు తీసుకువెళ్లడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారన్నారు. 32 వేల సంకీర్తనలు పాడిన పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమయ్య పేరుతో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలుగు భాష అభ్యున్నతికి, జిల్లా అభివృద్ధికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు.
- జిల్లా ఎస్పీ బి కృష్ణారావు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ నేడు శుభదినమన్నారు. సాంకేతిక, విజ్ఞాన పరంగా ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసుశాఖకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పోలీస్ పరెడ్ గ్రౌండ్‌లో రాయచోటి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు వేయి నామాలవాడు వెంకటేశుడా అంటూ చేసిన ఆధ్యాత్మిక నృత్యం అందరినీ ఆకట్టుకుంది. జాతీయ గీతాలాపనతో వేడుకలను ముగించారు. అంతకు ముందుగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా లెక్టర్ గిరీషా పీఎస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అడిషనల్ ఎస్పీ రాజకమల్, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# మురిపించన్

### 80.05 శాతం పింఛన్ల పంపిణీ



రాయచోటిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రాయచోటి: పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. బుధవారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా 80.05 శాతం మందికి పింఛన్లు అందజేశారు.ఆయా ప్రాంతాల్లోని వలంటీర్‌లు వేకువజామునే అర్హుల ఇంటింటికీ వెళ్లారు. పండుటాకులను పలకరించారు. వలంటీర్‌లను చూడగానే వృద్ధులు, వికలాంగులు ఇతర కేటగిరీకి చెందిన వారు సంతోషపడ్డారు.జిల్లాలో 224914 మంది పెన్షన్ దారులకు రూ. 62.06 కోట్లు మంజూరైంది. ఇందులో మొదటిరోజు రాత్రి 7.30 గంటల వరకు 180035 మందికి రూ. 49.62 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ, ఏపీడీ ధర్మరాజు తెలిపారు. మిగిలిన వారికి మరో రెండు రోజుల్లో పూర్తిగా పంపిణీ చేస్తామని వారు తెలిపారు. ఆదివారం ఉదయం డీఆర్‌డీఏ పెన్షన్ డీపీఎం ధర్మరాజు జిల్లాలో జరుగుతున్న పంపిణీ విధానాన్ని పరిశీలించారు. వేలి ముద్రల ఆధారంగా అందని వారికి కంటిచూపు ద్వారా గుర్తింపు చేసి అర్హులకు పింఛన్లను అందజేశారు. ప్రతినెల 1వ తేదీన వలంటీర్లు పింఛన్ నగదు అందజేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్టీసీకి రూ.1.23 కోట్ల ఆదాయం

కోటిరెడ్డి సర్కిల్: దసరా సందర్భంగా ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు జిల్లా నుంచి పలు ప్రాంతాలకు 420 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపారు. దీనివల్ల రూ 1,23,91,887 ఆదాయం లభించిందని వైఎస్సార్ జిల్లా ప్రజా రవాణా అధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప డిపో నుంచి 134 బస్సులను నడపగా రూ 41,52,013, పులివెందుల నుంచి 69 బస్సులను తిప్పగా రూ 21,91,062, బద్వేల్ నుంచి 43 బస్సుల ద్వారా రూ 13,06,603, జమ్మలమడుగు నుంచి 66 బస్సులకు రూ 16,04,761, మైదుకూరు నుంచి 32 బస్సుల ద్వారా రూ 9,10,945, ప్రొద్దుటూరు నుంచి 80 బస్సులకు గాను రూ 22,26,503, మొత్తం 425 బస్సుల ద్వారా 3,01,975 కిలో మీటర్ల ద్వారా రూ 1,23,91,887 ఆదాయం లభించిందని తెలిపారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

కడప కల్చరల్: కడప, కర్నూలు జిల్లా పరిధిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కడప లోకల్ సెంటర్ నూతన చైర్మన్‌గా డాక్టర్ వి. ఆదినారాయణ రెడ్డి, గౌరవ కార్యదర్శిగా ఎ. వెంకటేశ్వర్లు, ఎన్నికయ్యారు. స్థానిక హౌసింగ్ బోర్డు వద్ద గల సంస్థ కార్యాలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. దీంతో పాటు లోకల్ సెంటర్ నూతన కార్యవర్గ సభ్యులుగా ఇంజినీర్లు గంజికుంట గణేష్, వైవీ వెంకట రమణయ్య, వై. వెంకట సుబ్బారెడ్డి, ఎస్. చౌడప్ప, ఎస్. విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ జి. హేమలత, ఎస్. షాహనాజ్, ఆర్. రామ్మకృష్ణారెడ్డి, వి. రామచంద్రారాజు, మద్దెల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కడప లోకల్ సెంటర్ సభ్యులుగా తొలిసారి ఇద్దరు మహిళలకు స్థానం లభించింది, మహిళా కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ జి. హేమలత, ఎన్. షాహనాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## క్లుప్తంగా

### లక్ష రూపాయల నగదు చోరీ


బాధితురాలు లక్ష్మి

ముద్దనూరు : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ దాచుకున్న లక్ష రూపాయల నగదు చోరీకి గురైంది. బాధితురాలి వివరాల మేరకు.. యర్రగుంట్ల మండలం చిలంకూరుకు చెందిన లక్ష్మి స్థానిక బ్యాంకు నుంచి లక్ష రూపాయల నగదు డ్రా చేసుకున్నారు. ఓ ప్లాస్టిక్ కవర్‌లో నగదు ఉంచి కట్టెల సంచిలో దాచుకుంది. అనంతరం చిలంకూరు నుంచి ముద్దనూరుకు బస్సులో వచ్చారు. ముద్దనూరు పాత బస్టాండుకు రాగానే సంచి చూసుకోగా.. బరువు తక్కువగా ఉండడంతో అనుమానంతో తెరచి చూసింది. లక్ష రూపాయలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానిత మహిళలపై ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

### వాహనం ఢీకొని దుప్పి మృతి

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలో రాజంపేట అయ్యప్పస్వామి గుడి వద్ద ఓ వాహనం ఢీకొని దుప్పి బుధవారం అక్కడికక్కడే మృతి చెందింది. మరో దుప్పికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు. రేంజర్ నారాయణ మాట్లాడుతూ వాహనం ఢీకొని రెండు దుప్పిలు గాయపడగా, ఒక దుప్పి మృతి చెందిందని, మరో దుప్పికి కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయన్నారు. చికిత్స చేసి జూపార్కుకు తరలించినట్లు తెలిపారు.

### నలుగురు జూదరుల అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అంభాభవనా నగర్‌లో జూదమాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజా తెలియజేశారు. వారి నుంచి రూ. 5040 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి

చిట్వేలి : చిట్వేలి–రాపూరు ప్రధాన రహదారిలో భాకరాపురం కొత్తపల్లి వద్ద ఆర్టీసీ బస్సు, మోటార్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట నుంచి నెల్లూరుకు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. ఎం.రాచపల్లి నుంచి చొక్కారాజు వెంకట సుబ్బరాజు(60), ఉమ్మరాజు కనకరాజు(55) బైక్‌పై వస్తున్నారు. రాచపల్లి క్రాస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులోకి వస్తుండగా ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బరాజు తలకు తీవ్ర గాయమై.. తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. బైక్‌పై కూర్చున్న కనకరాజుకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంగయ్య తెలిపారు.

### డ్రైవర్‌కు గాయాలు

రామాపురం : రాయచోటి నుంచి కడప వైపు లిఫ్టింగ్ వాహనంలో డ్రైవర్ వెళ్తుండగా కడప నుంచి వస్తున్న ఐచర్ వాహనం మండలంలోని చిట్లూరు సమీపంలో ఢీకొంది. ఈ లిఫ్టింగ్ వాహనం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను మళ్లించారు.

# ఆధార్ కోసం అగచాట్లు

**లబ్ధి పొందలేకపోతున్న గిరిజనులు**


గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం

ఓబులవారిపల్లి : ఆధార్ నమోదు సమయంలో ఆపరేటర్లు చేసే పొరపాట్లు లబ్ధిదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. రెక్కాడితే డొక్కాడని నిరుపేద గిరిజనులకు సంక్షేమ పథకాలకు అర్హత సాధించలేని పరిస్థితి. మండలంలోని జీవీ.పురం పంచాయతీ నూకనపల్లి గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా 20 యానాదుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గిరిజనులలో 25 మందికి పైగా ఆధార్ లేదు. గతంలో నమోదు చేసుకున్నప్పటికీ ఆధార్ నమోదు చేసే ఆపరేటర్లు తప్పులు చేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. కొందరికి వయసు తక్కువగా చూపడం, మరింత మందికి పేరు తప్పుగా నమోదు చేయడం చేశారు. ఆధార్‌స కాలంలో అందక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు వారికి దూరమవుతున్నాయి. ఏ పథకానికి అర్హత పొందలేక తల్లిడిల్లిన వారంతా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారు. రైల్వే కోడూరు, రాజంపేట ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకపోయింది.

**ప్రభుత్వ విప్ చొరవతో...**

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో నూకనపల్లికి విచ్చేసిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులుకు గిరిజనులు తమకు ఆధార్ కార్డులు లేవని విన్నవించారు. తాము ఎంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశఖూరు. చలించిపోయిన ప్రభుత్వ విప్ గిరిజనులకు మూడు రోజుల పాటు జీవీపురం సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయించారు. వారంతా బారులు తీరి నమోదు చేయించుకున్నప్పటికీ అవి పలు కారణాలతో చెల్లక పోవడంతో కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.

**వయస్సు తక్కువనే కారణంతో..**



నా వయస్సు తక్కువ వేశారు... నాకు 21 సంవత్సరాలుంటే కార్డులో 13 సంవత్సరాలు వేశారు. మా భార్యకు 20 సంవత్సరాలుంటే 13 సంవత్సరాలు వేశారు. నా భార్య గర్భిణి. మేము ఎక్కడికి పోయినా ఆధార్ అడుగుతున్నారు. ఊరికి వచ్చే నర్సులు కూడా ఆధార్ అడుగుతున్నారు. ఆధార్ తీయించి ఆదుకోండి.

– ఉదయగిరి శివకుమార్, నూకనపల్లి, ఓబులవారిపల్లి మండలం

**ఆస్పత్రిలోనూ సేవలందడం లేదు**



నాకు, మా కుటుంబంలో చాలామందికి ఆధార్ సంఖ్య లేదు... చాలామార్లు నమోదు చేసుకున్నా.. ఏవో కారణాలతో అందకుండాపోతోంది. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందడం లేదు. ఆస్పత్రికి పోయినా ఆధార్ కార్డు చూపకపోవడంతో ఉచిత వైద్య సేవలందడం లేదు. కార్డు తీయించి పుణ్యం కట్టుకోండి.

– ఉదయగిరి అంజలి, నూకనపల్లి, ఓబులవారిపల్లి మండలం

## అంతర్‌జిల్లా క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్


క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప టూటౌన్ సీఐ ఎ. తబ్‌రేజ్


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

- జిల్లా వ్యాప్తంగా పోలీసులు దాడులు
- రూ.10.15 లక్షల నగదు స్వాధీనం
- పరారీలో ప్రధాన బుకీలు
- కడప టూటౌన్ సీఐ ఎం. తబ్‌రేజ్ వెల్లడి

కడప అర్బన్ : గుట్టు చప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో క్రికెట్ బుకీలు, వారి కార్యకలాపాలపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నిఘా పెట్టారు. ఇందులో భాగంగా కడప డీఎస్పీ ఎండీ.షరీఫ్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ ఎం.తబ్రేజ్, ఎస్‌ఐలు జయరాముడు, సంజీవరాయుడు, సిబ్బంది కలిసి పలు చోట్ల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు అంతర్ జిల్లా క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యులు పట్టుబడ్డారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ తబ్రేజ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 30న శ్రీలంక– ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో గెలిచిన డబ్బును క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యులు పంచుకునేందుకు స్థానిక బీఎస్సెన్నెల్ కార్యాలయంలోని ముళ్లకంపల్లో ఉన్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు చేశారన్నారు. కడప నగరానికి చెందిన నీలాపురం చాంద్‌బాషా, సయ్యద్ ఆలీ, సాయినాథం వెంకటసుబ్బయ్య, కర్నూలు టౌన్‌కు చెందిన సయ్యద్ చాంద్‌బాషా, షేక్ జాఫర్ హుసేన్, షేక్ హబీబుల్లా, సయ్యద్ అఫ్రోజ్‌బాషాలను అరెస్టు చేసి వారి నుంచి రూ.10.15 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెట్టింగ్ ఆడించిన ప్రధాన బుకీలు ప్రొద్దుటూరుకు చెందిన నిసార్‌బాషా, ఫారుఖ్‌గా గుర్తించి గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో క్రికెట్ బుకీలను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీఐతోపాటు, డీఎస్పీ అభినందించారు.

## క్రీడల్లో రాణించాలి

**– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్**

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం క్రీడాకారులు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడల పోటీల్లో రాణించాలని వైస్ చాన్సలర్ ఆచార్య చింతాసుధాకర్ కోరారు. వైవీయూలోని వేమన ప్లే ఫీల్డ్స్‌లో మహిళలు, పురుషుల కబడ్డీ జట్టుకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న వారంతా విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల నుంచి 125 మంది పురుషులు, 45 మంది మహిళలు ఎంపికల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వీసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా.నరసింహ, మనోహర్, మదన్‌మోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

## బైక్ అదుపు తప్పి యువకుడు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగదీష్

కమలాపురం : కడప–తాడిపత్రి రహదారిలోని పందిళ్లపల్లె ఈద్గా వద్ద బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందారు. ఎస్‌ఐ హృషీకేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరుకు చెందిన ఎం.జగదీష్(22) ఎర్రగుంట్ల మైన్స్ చెక్‌పోస్టు వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి దేవుని కడపలో ఓ కార్యక్రమానికి వెళ్లిన జగదీష్ బుధవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరారు. మార్గ మధ్యంలో పందిళ్లపల్లె ఈద్గా వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జగదీష్‌కు తల్లి, తండ్రి, సోదరుడు ఉన్నారు.

## గెలిచి.. సాధించాడు

**జంప్ రోప్‌లో అంతర్జాతీయ స్థాయికి**


విద్యార్థి మహమ్మద్ బాషాను అభినందిస్తున్న అర్బన్ సీఐ మస్తాన్

మైదుకూరు : ఆర్థిక ఇబ్బందులున్నా.. ఆటపై మక్కువతో కష్టపడ్డాడు. జంప్ రోప్ పోటీల్లో గెలిచి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో స్థానం సంపాదించాడు. మైదుకూరుకు చెందిన విద్యార్థి మహమ్మద్ బాషా థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 13న తెనాలిలో జరిగిన జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు మైదుకూరు హైస్కూల్ నుంచి పాల్గొన్న బాషా ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం అందుకున్నారు. అక్కడ సత్తా చాటడంతో ఈ నెల 17న జరిగే అండర్–17 అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన బాషాను సీఐ మస్తాన్, ఎస్‌ఐలు ఘన మద్దిలేటి, సీవీ రమణ సత్కరించారు. బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్జీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు, మునెయ్య, ఎల్.సూర్యనారాయణ రెడ్డి, తవ్వా ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక ఇబ్బందులు అధిగమించి...**

కడప కోర్టులో పనిచేస్తున్న మహబూబ్ బాషా, రబియా బేగంల కుమారుడు మహమ్మద్‌బాషాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. 13 ఏళ్ల కిందట తండ్రి మృతి చెందాడు. తల్లి రబియా బేగం మైదుకూరు కోర్టులో అటెండర్‌గా పనిచేస్తూ పదేళ్లుగా అక్కడే నివాసముంటోంది. జంప్‌రోప్ పోటీల్లో మహమ్మద్ బాషా రాణించి థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనా అంతడిని ఆర్థిక ఇబ్బందులు వేధించాయి. ఇది గుర్తించి స్థానిక ముస్లిం కమ్యూనిటీ నాయకులు ఆదాం సాహెబ్‌గారి యాకూబ్, అడ్వకేట్ అబ్దుల్లా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

## తప్పిపోయిన బాలిక అప్పగింత


బాలికను తల్లికి అప్పగిస్తున్న త్రీ టౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : దారి తప్పి ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్న 11ఏళ్ల బాలికను త్రీటౌన్ క్షేమంగా ఆమె తల్లికి అప్పగించారు. యర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కుమార్తె నవ్య ఎర్రగుంట్లలోని తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటోంది. పెదనాన్న కుమార్తెను కలిసేందుకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బస్సులో మంగళవారం ప్రొద్దుటూరుకు వచ్చింది. హాస్టల్ ఎక్కడ ఉందో తెలియక పట్టణంలో తిరిగి అలసిపోయిన నవ్య జమ్మలమడుగు రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్ వద్ద ఒంటరిగా కూర్చుండి పోయింది. త్రీటౌన్ కోర్టు కానిస్టేబుల్ పవన్ బాలికను గమనించి వివరాలు ఆరా తీశాడు. బాలిక భయంతో సమాధానం చెప్పకపోవడంతో ఆమెకు ధైర్యం చెప్పి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. సీఐ వెంకట రమణ సూచనతో బాలిక ఫొటోను వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు చేశారు. కలమల్ల గ్రామస్తులు గుర్తించి బాలిక తల్లి లక్ష్మీదేవికి సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన ప్రొద్దుటూరులోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. సీఐ వెంకటరమణ బాలికను తల్లికి అప్పగించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. కోర్టు కానిస్టేబుల్ పవన్‌ను సీఐ అభినందించారు.

## కరవు సహాయక చర్యలు చేపట్టండి


ఐక్యత చాటుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన వర్షపాతం లోటు ఉందని, తక్షణమే కరవు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సీపీఎం ప్రజారక్షణ భేరి బస్సు జాత బుధవారం కడపకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద జరిగిన సభలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15న విజయవాడలో ముగింపు సభ ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ళు పూర్తి కావస్తున్నా.. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. వలసల నివారణకు నిధులు కేటాయించాలన్నారు. ప్రజల మధ్య భాజపా విద్వేషాలు రేపుతోందని, మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందన్నారు. అసమానతలు లేని అభివృద్ధి సాధిద్దాం అనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ఉమామహేశ్వర రావు, శివనాగరాణి, రమాదేవి, జి.చంద్రశేఖర్, రామ్మోహన్, మనోహర్, సుబ్బమ్మ, శివకుమార్, దస్తగిరి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఏం సాధించారని సంబరాలు చేస్తారు?


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : చంద్రబాబు ఏం సాధించారని రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రొద్దుటూరు విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్కిల్ స్కామ్ కేసులో కాకుండా.. అనారోగ్య కారణాలతో ఆయనకు బెయిల్ వచ్చిందని గుర్తు చేశారు. జైలులో ఉన్నప్పుడు ములాఖత్‌ల ద్వారా కుటుంబ సభ్యులు, పార్టీ నేతలను అప్పుడప్పుడూ కలిసే వీలుండేదన్నారు. ఇంటికి పోవద్దు.. కుటుంబ సభ్యులతో మాట్లాడొద్దు.. రాజకీయ కార్యకలాపాలు నిర్వహించవద్దు.. యాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దు అనే కండీషన్లతో బెయిల్ ఇవ్వడంతో బాబును మరింత నిర్బంధించినట్లు ఉందన్నారు. ఈ నెల 28న బాబు చక్కగా జైలుకు వెళ్లాల్సిందే అన్నారు. 17ఎ తనకు వర్తించదని, జబ్బులతో ఇబ్బందిపడుతున్నానని కోర్టుకు బాబు చెప్పుకున్నారన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

## పొలం విషయంలో ఘర్షణ

ఓబులవారిపల్లె : మండలంలోని గాడివారిపల్లె గ్రామంలో పొలం విషయంలో ఘర్షణ జరగడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైతు శివశంకర్ రెడ్డి పొలంలో స్థానికులు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. నా పొలంలో ఎందుకు ఇలా చేస్తున్నారంటూ వారిని ప్రశ్నించడంతో దుర్భాషలాడుతూ తనపై దాడి చేశారని శివశంకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



## అపోహలు తొలగిస్తూ.. చైతన్యం చేస్తూ

**మానసిక వైద్య నిపుణుడికి వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు**


డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు : అంచలంచెలుగా వైద్య వృత్తిలో ఎదిగిన ఆయన తన సేవలను విస్తరిస్తూ వచ్చారు. మానసిక వైద్యుడిగా రోగుల్లో అపోహలు తొలగించడమేగాక, బాణామతి నుంచి ప్రజలను చైతన్యం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. సార్క్ సైక్రియాట్రిక్ సమాఖ్యకు ఎన్నికైన తొలి తెలుగువాడిగా ఘనత సాధించారు. వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం గుడిపాడులో జన్మించిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వైద్యరంగంలో సేవలందించినందుకు వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు బుధవారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ పురస్కారం అందజేశారు.

గుడిపాడు గ్రామంలో నివాసముంటున్న పెద్దవీరారెడ్డి, నందమ్మ దంపతుల కుమారుడు ఇళ్ల రామసుబ్బారెడ్డి ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్, కొట్టి హైస్కూల్, ఎస్‌సీఎస్‌ఆర్ కళాశాలలో చదువుకున్నారు. కర్నూలు మెడికల్ కళాశాల నుంచి 1976లో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన బెంగళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్) నుంచి మానసిక వైద్య శాస్త్రంలో ఎండీ డిగ్రీ, డీపీఎం డిగ్రీ తీసుకున్నారు. రాయవేలూరు క్రిస్టియన్ మెడికల్ కళాశాల, పాండిచ్చేరిలోని జిప్‌మర్, బెంగళూరులోని నిమ్‌హాన్స్‌లో సైకియాట్రిస్టుగా పనిచేశారు. అనేక ప్రాంతీయ, జాతీయ అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్న ఆయన వివిధ పత్రికల్లో మానసిక సమస్యలపై వ్యాసాలు, కథలు, సమస్యలకు సమాధానాలు రాసి జబ్బులపై అపోహలలు తొలగించేందుకు ప్రయత్నించారు. విజయవాడలో మానసిక వ్యాధుల హాస్పిటల్ ప్రారంభించడమేగాక 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా తన ఆస్పత్రిలోనే తొలి డీఎన్‌బీ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సు ప్రారంభించారు.

**ఎన్నో పదవుల్లో...**

2021లో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా, 2022లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా పదవులు చేపట్టారు. కృష్ణా, గుంటూరు జిల్లాల జువైనల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా ఈయనను నాలుగు మార్లు ప్రభుత్వం నియమించింది. బాణామతి భయం ప్రబలంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని మెదక్, నల్గొండ, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పర్యటించి ప్రజల్లో చైతన్యం పెంచారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ సైక్రియాట్రిస్ట్ సొసైటీకి 2007లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు డాక్టర్‌గా రికార్డు సాధించారు. ఎనిమిది దేశాల మానసిక వైద్యులకు సంబంధించిన సార్క్ సైక్రియాట్రిక్ ఫెడరేషన్‌కు ఎన్నికైన తొలి ఇండియన్ డాక్టర్‌గా చరిత్ర సృష్టించారు.

## ఆటల్లో మేటి.. సత్తా చాటి

- వివిధ క్రీడాంశాల్లో విద్యార్థుల ప్రతిభ
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


పతకాలు సాధించిన క్రీడాకారులతో అధికారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడల పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయి టోర్నమెంట్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి స్వర్ణ పతకాలు సాధించారు. ఫుట్ బాల్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో రాణించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కె.జగన్నాథరెడ్డి అభినందించారు. ఎంచు కున్న లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకుండా కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు హరి, అనిల్, ఖాదర్‌బాషా, వెంకటేశ్వర రావు, గౌస్‌బాషా పాల్గొన్నారు.

**అథ్లెటిక్స్‌లో రాణించిన క్రీడాకారుల వివరాలిలా..**

- జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో టి. అరుణ, అనురాధ, శృతి ద్వితీయ స్థానంలో నిలిచారు.
- అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 పోటీల్లో కె.మనీష, భువన, సావిత్రి, భానుశ్రీ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో నిర్వహించిన 34వ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్‌లో డి హరిశంకర్, మల్లికార్జున, రాజేశ్వరి స్వర్ణం, డి.సంధ్య రజితం, డి.హరిశంకర్, కె.సుకేష్ కాంస్య పతకాలు సాధించారు.
- తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జరిగిన ఒకటో హాకీ ఇండియా ఉమన్ సబ్ జూనియర్ సౌత్ జోన్ హాకీ పోటీల్లో విద్యార్థులు రాణించారు. కె.తులసి, జి.అనిత, ముజియాబేగం, నందిని, నాగమణి, వైష్ణవి, దీక్షామాధురి, సింధుప్రియ స్వర్ణం సాధించారు.
- గోవాలో జరుగుతున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో వి.హేమలత ప్రతిభ చూపారు.
- ఎస్‌జీఎఫ్ అండర్–17 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో టి. పావని, గాయత్రి, కుసుమప్రియ రాణించారు.
- కోయంబత్తూరులో నవంబరులో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో బి.సంధ్య, కె.వేదవర్షిణి, డి. హరిశంకర్, అరవింద్, కె.వి.ఎస్. దొర, సుకేష్, శ్రీనివాస్, మల్లికార్జున రాణించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు.